క్లుప్తంగా

ఆస్తి పన్ను పెనాల్టీలో 90శాతం మినహాయింపు

మహబూబాబాద్: 2022–23 వరకు ఆస్తి పన్ను బకాయిలు ఉన్నటువంటి గృహాల పెనాల్టీలో 90 శాతం మినహాయింపు ఇస్తూ కేవలం పెనాల్టీలో 10 శాతం మాత్రమే చెల్లించుటకు ప్రభుత్వం అవకాశం కల్పించిన్నట్లు మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బకాయిలు ఉన్న యాజమానులు వన్ టైం సెటిల్ మెంట్ కింద బకాయిలు అసలు మొత్తం చెల్లించి 90 శాతం మినహాయింపు పొందాలన్నారు. ఈ అవకాశం ఈ నెల చివరి వరకు అమలులో ఉంటుందన్నారు.

కొనసాగుతున్న ప్రజావేదిక

కేసముద్రం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం రెండో రోజు గురువారం కొనసాగింది. ఆయా గ్రామాల్లో మొక్కల సంరక్షణలో కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది నిర్లక్ష్యం వహించారంటూ సామాజిక తనిఖీ బృందంతోపాటు పలువురు ప్రజావేదిక దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు దీనిపై విచారణ జరిపి సంబంధిత అధికారులపై, ఈజీఎస్ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని, జరిమానా విధించనున్నట్లు అడిషనల్ డీఆర్డీఓ శాంతకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంబుడ్స్‌మెన్ ఆదామ్, డీపీఓ యాకుబ్, ఎంపీడీఓ వివేక్ రామ్, ఏపీఓ ప్రదీప్ పాల్గొన్నారు.

అంబులెన్స్ కోసం పడిగాపులు

గార్ల: అంబేడ్కర్‌నగర్‌కు చెందిన కాగితపు వెంకటి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో గురువారం సీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వెంకటిని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించేందుకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు 108 వాహనానికి ఫోన్ చేసినా వాహనం రాలేదు. అసలు విషయం ఏమిటంటే గార్ల మండలానికి కేటాయించిన 108 వాహనంను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రిలో సీరియస్‌గా ఉన్న రోగులను, వరంగల్ ఎంజీఎంకు తరలించేందుకు 108 జిల్లా అధికారి వినియోగించుకుంటున్నాడని సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాసరావు ఆరోపిస్తున్నారు. కలెక్టర్ స్పందించి గార్ల మండలంకు చెందిన అంబులెన్స్‌ను వరంగల్‌కు పంపించే అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంట క్షేత్రాల పరిశీలన



కేసముద్రం: వరిలో సస్యరక్షణ చర్యలను చేపట్టాలని ఏఓ వెంకన్న సూచించారు. గురువారం మండలంలోని కాట్రపల్లి, భవానిగడ్డ తండాజీపీలో వరి పంట క్షేత్రాలను ఏఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వరిలో ముగిపురుగు, ఆకుమచ్చ, జింక్‌లోపం ఉన్నందున, నివారణ చర్యలను చేపట్టాలన్నారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పోరాటాల్లోనూ ముందుండాలి

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు చదువుతో పాటు పోరాటాల్లో ముందుండాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గుండ్ల రాకేష్ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్, వినిత్, నవీన్, ప్రణయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళల మృతి

మహబూబాబాద్ రూరల్ : గుర్తు తెలియని మహిళలు వేర్వేరు ప్రాంతాల్లో మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ టౌన్, మహబూబాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ల పరిధిలో గురువారం చోటుచేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి మధ్యాహ్నం సమయంలో సుమారు ముప్పై ఐదు ఏళ్ల వయసు గల ఓ వివాహిత వైద్య పరీక్షల కోసం వచ్చింది. ఆమె స్థానికంగా ఉన్న మంచినీటి కూలర్ వద్ద నీళ్లు తాగేందుకు రాగా ఫిట్స్ వచ్చి కిందపడిపోయింది. గమనించిన ఆస్పత్రి సిబ్బంది వెంటనే ఆమెను చికిత్స కోసం ఆసుపత్రి లోపలికి తీసుకువెళ్లి చికిత్స అందిస్తుండగా మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో...

మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముడుపుగల్ గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డు పక్కన ఓ గుర్తు తెలియని వృద్ధురాలు మృతిచెంది ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమె రెండు, మూడు రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వృద్ధురాలు మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

అర్చకుడి నియామకం

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని ఉమాచంద్రమౌళీశ్వర స్వామివారి దేవాలయంలో ప్రధాన అర్చకుడిగా అన్నావఝుల యుగంధర్ శర్మ గురువారం విధుల్లో చేరారు.

ప్రభుత్వ బడులను కాపాడాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



దంతాలపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

దంతాలపల్లి: ప్రభుత్వ బడులను కాపాడేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలక్ష్మి అధ్యక్షతన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మండల సందర్శన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం మండలంలోని పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జి. రాము, మండల నోడల్ అధికారి ఎం. శ్రీదేవి, జిల్లా టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడు ఏ. మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహులపేట: సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డికి కాంట్రాక్ట్ ఉద్యోగులు వినతి పత్రం అందచేశారు. విద్యాశాఖలో సమస్యలను తెలుసుకోవడానికి మండలాల సందర్శనలో భాగంగా గురువారం నర్సింహులపేట మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన విద్యాశాఖ అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ రామ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు మహంకాలీ వీరన్న, స్వప్న, రవి, శ్రీదేవి, సైదులు, శైలం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు: పార్లమెంట్ ఎన్నికల కోడ్ రాకముందే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి తెలిపారు. గురువారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందితో ఎమ్మెల్సీ సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఇట్టె శ్యామ్ సుందర్‌రెడ్డి, ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఎంఈఓ గుగులోతు రాము, మురళీకృష్ణ, బుచ్చయ్య పాల్గొన్నారు.

బడుల బలోపేతానికి చొరవ చూపాలి

పెద్దవంగర: సర్కార్ బడుల బలోపేతానికి ప్రతి ఒక్కరు చొరవ చూపాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్ వద్దగల ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ రాము అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎన్ఓ శ్రీనివాస్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళి కృష్ణ, ఎంపీడీఓ వేణుమాదవ్, నాయకులు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నిధుల విడుదలలో విఫలం



మాట్లాడుతున్న విజయసారథి

మహబూబాబాద్: గత ఎన్నికల ముందు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రకటించిన సుమారు రూ.78 కోట్లు ప్రకటనలకే పరిమితమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాజీ మంత్రి కేటీఆర్ ఆవిష్కరించిన పైలాన్ ఎదుట సీపీఐ కౌన్సిలర్లు, నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్‌సారదిరెడ్డి నిధుల విషయం గురించి వివరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి మాట్లాడుతూ మానుకోట మున్సిపాలిటీ అధికార బీఆర్ఎస్ పాలక పక్షం అసమర్థతతోనే నిధులు రాలేదన్నారు. వారి అసమర్థ పాలనను కప్పిపుచ్చుకునేందుకు అంతర్గత కుమ్ములాట జరుగుతున్నాయన్నారు. దానిలో భాగంగానే వైస్ చైర్మన్‌పై అవిశ్వాస డ్రామా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బి.నీరజారెడ్డి దర్మన్న, నాయకులు పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, సాంబలక్ష్మి, శ్రావణ్, లింగ్యా, రవీందర్, ప్రవీణ్, శంకర్, వెంకటేష్, జ్ఞానేశ్వర్, పద్మ, భాగ్య, కుమార్, నాగార్జున, మహేందర్, వికాస్, శ్రీనాద్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎల్లమ్మ

డోర్నకల్: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ డోర్నకల్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఎల్లమ్మ హెచ్చరించారు. స్థానిక అంబేడ్కర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పట్టణ పరిధి అంగన్‌వాడీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గర్భిణులు, చంటిపిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం చేసేలా, చంటి పిల్లలు మధ్యాహ్నం కేంద్రాల్లో నిద్రించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉదయం 9 గంటల నుంచి సాయింత్రం 4 గంటల వరకు కేంద్రాలు తెరిచి ఉంచాలని, షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావాలి



మాట్లాడుతున్న సచ్చిదానంద సరస్వతి

తొర్రూరు: పురాతన ఆలయాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ధర్మపురి మఠం అధిపతి సచ్చిదానంద సర్వసతి తెలిపారు. గురువారం డివిజన్ కేంద్రంలోని అయ్యప్ప ఆలయం, శివాలయంను మఠాధిపతి సందర్శించారు. అనంతరం బ్రాహ్మణ ప్రతినిధులు, అర్చకులతో కలిసి సచ్చిదానంద సరస్వతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బోప్పా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్, బ్రాహ్మణ సంఘ రాష్ట్ర నాయకులు గంగు నవీన్‌శర్మ, అర్చకులు శివశర్మ, సంతోష్‌శర్మ, వెంకట్, వల్లపు మధు తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ విజయ్‌కుమార్

నెహ్రూసెంటర్: ఈ నెల 3వ తేదీన నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అర్బన్ పీహెచ్‌సీలో పల్స్‌పోలియో విజయవంతంపై పీడీఎం, ఎంఎల్‌హెచ్‌పీ, సూపర్ వైజర్లు, ఆశ, అంగన్‌వాడీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ అర్బన్ ప్రాంతంలో 21 బూత్‌లు, ఒక మొబైల్ టీం ఏర్పాటు చేశామని, 5,421 మంది ఐదేండ్ల లోపు పిల్లలకు వ్యాక్సినేషన్ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వసంతరాణి, ఒబిలిశెట్టి రామకృష్ణ, డాక్టర్లు రమ్య, నర్మద, కిరణ్మయి, సూపర్‌వైజర్లు రత్నకుమారి, పుష్పలీల, పద్మావతి పాల్గొన్నారు.

పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం



కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులకు వైద్యపరీక్షలను నిర్వహించి, మందులను పంపిణీతో పాటు 230 మంది విద్యార్థులకు వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యుడు, రిటైర్డ్ తహసీల్దార్ ఒద్దిరాజు సుభాష్‌చందర్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడి చదవాలన్నారు. అనంతరం సుభాష్‌చందర్‌ను ఉపాధ్యాయ బృందం సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రూపారాణి, రంగరాజు పద్మజ, దిశ, రామ్మూర్తి, రజిత, పీహెచ్‌సీ వైద్యులు సురేష్, దామోదర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపిక



బూర రాజశేఖర్

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని హ న్మంతునిగడ్డ దళితవాడకు చెందిన దళిత యువకు డు బూర రాజశేఖర్ మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఇటీవల ట్రైబల్ గురుకుల ప్రభుత్వ ఉ ద్యోగాల బోర్డు వారు నిర్వహించిన పరీక్షలో రాష్ట్ర స్థాయి 50వ ర్యాంక్ సాధించడంతో జూనియర్ లెక్చరర్ పోస్టు సాధించారు. పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) తెలుగు ఉపాధ్యాయులులకు పరీక్ష నిర్వహించగా రాష్ట్ర స్థాయిలో 94వ ర్యాంక్, ట్రైయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టు (టీజీటీ) జోన్ నాలుగో 9వ ర్యాంక్‌తో 190 మంచి మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ కుటుంబ సభ్యుల సహకారంతో ఉద్యోగం సాధించానన్నారు.

ఉద్యోగాల జ్యోతి..



జ్యోతి

కేసముద్రం: కేసముద్రంస్టేషన్‌కి చెందిన చీకటి జ్యోతి అనే వివాహిత చిన్నప్పటి నుంచి కష్టపడి చదువుతూ ఎంఏ, బీఈడీ పోలిటికల్ సైన్స్ పూర్తిచేసింది. ఈ క్రమంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేసి, ఆ తర్వాత కుటుంబ పోషణ కోసం భర్త నవీన్‌తో కలిసి, హోటల్ నడుపుకుంటూ వచ్చింది. గత ఏడాది ఆగస్టులో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్ పోస్టులకు పరీక్ష రాసింది. ఈ క్రమంలో వారం క్రితం పీజీటీ ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో జ్యోతి పీజీటీ (సోషల్ టీచర్) ఉద్యోగానికి ఎంపికైంది. కాగా గురువారం వెలువడి జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో సివిక్స్ లెక్చరర్‌గా కూడా ఉద్యోగం సాధించింది.

రంగు మారిన 'వందేభారత్'



డోర్నకల్: డోర్నకల్ రైల్వేస్టేషన్ మీదుగా బుధవారం వెళ్లిన వందేభారత్ రైలు రంగు మారి కనిపించింది. చెన్నై నుంచి పాట్నాకు ఖాళీ భోగీలతో వెళ్తున్న వందేభారత్ రైలు నారింజ, నలుపు రంగులో దర్శనమిచ్చింది. ప్రస్తుతం సికింద్రాబాద్, విశాఖపట్టణం మధ్య నడిచే రైలు తెలుపు, నలుపు రంగులో ఉండగా బుధవారం కొత్త రంగుల్లో కనిపించిన వందేభారత్ రైలును స్థానికులు ఆసక్తిగా గమనించారు.

అయోధ్యకు రామ భక్తులు

మరిపెడ రూరల్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యకు మరిపెడ మండలం నుంచి పలువురు భక్తులు గురువారం తరలివెళ్లారు. అక్కడ రామమందిర్‌లోని బాల రాముడి దర్శించుకుని ఐదు రోజుల పర్యటనలో భాగంగా తిరిగిరానున్నట్లు వారు తెలిపారు. తరలివెళ్లిన వారిలో డాక్టర్ జెట్టి మురళి, మామిడాల మునేష్, పెసర దినేష్‌రెడ్డి, గంధసిరి కృష్ణ, గంట్ల మహిపాల్‌రెడ్డి, నాని, కాంతారావు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ప్రభుదాస్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

డోర్నకల్: 2008, ఫిబ్రవరి 29న ఉపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించి 16 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న డోర్నకల్ ఎంపీపీఎస్ టీచర్ డి.ప్రభుదాస్‌ను బుధవారం సన్మానించారు. స్థానిక ఎంపీపీఎస్‌లో ప్రభుదాస్‌ను సహా ఉపాధ్యాయులు వెంకట్రావు, గౌసియా, జాస్మిన్, విద్యార్థులు సన్మానించారు.

వీడ్కోలు సమావేశం

కురవి: మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్‌లో ఎస్సెస్సీ విద్యార్థులకు గురువారం వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సేవాలాల్ ఉద్యోగ సేన జిల్లా కోఆర్డినేటర్‌గా బాలాజీ

నెహ్రూసెంటర్: సేవాలాల్ ఉద్యోగ సేన జిల్లా కోఆర్డినేటర్‌గా బోడ బాలాజీని నియమించినట్లు సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్న నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

చేతిపంపు పునరుద్ధరణ

మరిపెడ రూరల్: మరిపెడ మండలం బాల్నిధర్మారంలో ప్రాథమికోన్నత పాఠశాలలో చేతి పంపును గురువారం పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో బిచ్చు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

విజయసంకల్ప యాత్ర విజయవంతం

మహబూబాబాద్ అర్బన్: మానుకోటలో నిర్వహించిన విజయసంకల్ప యాత్రను విజయవంతం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులకు, బీజేపీ కార్యకర్తలకు, ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్యపటేల్ తెలిపారు.

మాస్‌లైన్ బహిరంగ సభను జయప్రదం చేయాలి

బయ్యారం: మార్చి 3న ఖమ్మంలో నిర్వహించనున్న మాస్‌లైన్ పార్టీ ఆవిర్భావ బహిరంగసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి బిల్లకంటి సూర్యం గురువారం పిలుపునిచ్చారు.

వందశాతం ఫలితాలు సాధించాలి

గార్ల: టెన్త్‌లో విద్యార్థులు కష్టపడి చదువుకొని వంద శాతం ఫలితాలు సాధించాలని విశ్రాంత ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్ గంగావత్ రాంసింగ్ అన్నారు. గురువారం మండలంలోని పెద్దకిష్టాపురం హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు.

సడలమ్మ జాతర ప్రారంభం



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

గంగారం: మండల కేంద్రంలోని జెజ్జరి వారి ఇలవేల్పుల జాతర సడలమ్మ (సమ్మక్క) - జలజందరాజు జాతర గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వనం తెచ్చి గద్దెలపై ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై గద్దె వద్ద మొక్కులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో తలపతులు జెజ్జరి నగేష్, జెజ్జరి సమ్మయ్య నిగమని జెజ్జ లక్ష్మయ్య, జలకుదు జెజ్జరి కృష్ణ, వడ్డె సిద్దబోయిన సమ్మయ్య, శివ కుమారులు జోగ సూరక్క, జెజ్జరి వంశీయులు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి ఆశయాలు కొనసాగించాలి



సంతాప సభలో మాట్లాడుతున్న రవి

మహబూబాబాద్ రూరల్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు రాపర్తి యాదగిరి ఆశయాలు కొనసాగించాలని నోపా అధ్యక్షుడు వై.కృష్ణప్రసాద్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గద్దె రవి అన్నారు. కామ్రేడ్ రాపర్తి యాదగిరి సంతాపసభ నోపా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనడమే కాకుండా స్వాతంత్ర్య అనంతరం పీడిత ప్రజానీకం కోసం ఎనలేని కృషి చేశారన్నారు. అనేక మంది కార్యకర్తలు, నాయకులను తయారు చేయడంలో వారి కృషి అద్వితీయమని, వారి ఆశయాలను కొనసాగించడమే మన ముందున్న కర్తవ్యమన్నారు. ఈ సభలో నోపా ప్రధాన కార్యదర్శి కోలిపాక మల్లయ్య, ఉపాధ్యక్షులు లింగంపల్లి దయానంద్, తక్కెళ్లపల్లి వీరభద్రం, సమ్మెట రాజమౌళి, చౌడవరపు రంగన్న, పెనుగొండ బుజ్జి, లింగంపల్లి భిక్షపతి, న్యాయవాది సీతారాములు, రామగిరి రామచంద్రయ్య, రాపర్తి యాదగిరి కుటుంబ సభ్యులు, సతీమణి వెంకటమణి, దీపక్, బోస్, కాశీనాద్, కోటయ్య, రమాదేవి, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరికి ఘన నివాళి

తెలంగాణ స్వాతంత్ర సమరయోధుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత రాపర్తి యాదగిరి మృతిపట్ల గురువారం తెలంగాణ స్వాతంత్ర సమరయోధుల వారసుల సంఘం రాష్ట్ర ప్రతినిధి సింగు రమేష్ నివాళులర్పించారు. జిల్లా కేంద్రానికి చెందిన యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మరణించగా దశదిన కర్మ పట్టణంలోని ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలుకపల్లి ముత్తులింగం, యాదగిరి భార్య వెంకటమణి, కుమారులు రాపర్తి దీపక్, పూర్ణానంద బోసు, కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం పాలన దినోత్సవం



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులతో ఉపాధ్యాయులు



దంతాలపల్లిలో..



గూడూరు: బాలుర హైస్కూల్‌లో..

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఘనంగా స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు పలు సబ్జెక్ట్ ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు తరగతులను బోధించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడే పూజరి వీరయ్య, స్వరూపారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో గురువారం స్వయంపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, ప్రభుత్వ ఉపాధ్యాయులచే మెప్పు పొందారు.

దంతాలపల్లిలో..

దంతాలపల్లి: మండలం ఆగపేట ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వయంపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు వాసూరి రవీందర్, ఉపాధ్యాయులు కందుల రాజు, గుర్రం వెంకన్న, రఘు, ఆకాష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

లీప్.. సమ్మేళనం

- నాలుగేళ్లకోసారి కలుసుకుంటున్న పూర్వ విద్యార్థులు



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కేసముద్రం: లీప్ సంవత్సరం సందర్భంగా మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో కేసముద్రంస్టేషన్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన 1990–91 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు గురువారం కలుసుకున్నారు. ఆటపాటలతో సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. లీప్ సంవత్సరం రోజున ఇప్పటికి నాలుగు సార్లు కలుసుకున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో నల్ల కిరణ్, బాలరాజ్, రమేష్, పాశికంటి శ్రీనివాస్, గాంతి వెంకట్‌రెడ్డి, సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కిశోర్, శ్యామ్, సాంబమూర్తి, కన్నయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సోమిరెడ్డి, యాకయ్య, ఐలయ్య, నాగిరెడ్డి, పసిక నాగిరెడ్డి, అక్బర్, సత్యనారాయణ, మహేశ్వరి, వాణి, కళావతి, హైమ, శ్రీలత, రాణి, ఉష తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి గార్ల మండల సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సూరపురెడ్డి వెంకట్ రెడ్డి గురువారం వినతిపత్రం అందజేశారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

కురవి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు నిర్మించిన నూతన భవనంలో మౌలిక సదుపాయలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు కొలిపాక వీరేందర్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ అధికారికి గురువారం వినతిపత్రం అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత అన్నారు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 10న మహబూబాబాద్‌లో చేపట్టే సావిత్రి బాయి పూలే విగ్రహావిష్కరణ, మహిళా సదస్సుకు సంబంధించిన కరపత్రాలను గురువారం డివిజన్ కేంద్రంలో సంఘ నాయకులు ఆవిష్కరించారు.

సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య అన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మరిపెడ రూరల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని వీరారం శివారు ప్రాంతంలో పోలీసులు గురువారం పట్టుకున్నారు. సమాచారం మేరకు పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకొని మరిపెడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

50 బస్తాల బెల్లం సీజ్

నెల్లికుదురు: అక్రమంగా నిల్వ చేసి ఉంచిన 50 బస్తాల నల్లబెల్లం, 2 బస్తాల పటిక బెల్లం సీజ్ చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

ప్లకార్డులతో నిరసన

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం యాదవులకు గొర్రెలు లేదా డీడీల రూపంలో చెల్లించిన డబ్బులు ఇవ్వాలంటూ మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో గొర్రెల మేకల కాపరి దారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్లకార్డులతో నిరసన తెలిపారు.

రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం

నెహ్రూసెంటర్: రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని మాదిగ జేఏసీ అధ్యక్షుడు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. జిల్లా కేంద్రంలో మాదిగ జోడోయాత్ర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ జేఏసీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.